## నవ్వితే కోల్డ్ వార్ ప్రకటించే భర్తతో ఓ కోమలి తంటాలు!

# కోల్డ్ వార్

కె. రాణి

"రమా రమా అంటూ హడావిడిగా స్కూటర్ స్టాండ్ వేస్తూ వీధి గుమ్మంలో నించే అరుచుకుంటూ వచ్చాడు రమాపతి.

అతని హడావిడికి నవ్వుకుంటూ "అయిపోయిందండీ. ఒక్క పావు గంటలో బాబిగాడ్ని రెడీ చేసి తెస్తాను. పిక్చరుకింకా టైముందిలెండి" అంటూ, పర్పుల్ నైలెక్స్ చీరలో చంద్రకాంతలా మెరిసిపోతున్న రమ కాఫీకప్పుతో ఎదురొచ్చింది. "అయితే త్వరగా కానీ, మళ్ళీ టికెట్స్ దొరకవు" అనుకుంటూ కాఫీ సేవించసాగాడు రమాపతి.

రమాపతికి పెద్దలు పెట్టిన పేరు రాజశేఖర్. కానీ ఆఫీస్ టైమ్‌లో తప్ప క్షణం ఇలు వదలిరాని రాజశేఖరానికి స్నేహబృందం "రమాపతి" బిరుదాన్నిచ్చి సత్కరించింది. అతని ముఖ్య స్నేహితులు రమాపతీ! ఓ సారీ. రాజా అంటూ మేలమాడుతారు. అయినా అతనేం ఉడుక్కోడు. గట్టిగా కసురుకోడు. అది అతని స్వభావానికి విరుద్ధం.

రమాపతి హడావిడిగా స్కూటర్ స్టాండ్ వేసి, కష్టపడి కొల్లేటి చాంతాడులా వున్న క్యూనించి పావుగంట తర్వాత విజయ గర్వంతో చేతిలో టికెట్స్‌తో బయటపడ్డాడు. త్రొక్కిసలాటలో నలిగిపోయిన షర్ట్ సరిచేసుకుంటూ రమ దగరికి వచ్చేసరికి, రమనవ్వుతూ "వీరే మావారు రాజశేఖర్. ఏమండీ ఈయన బి. ఏ. లో నా క్లాస్‌మేట్" అంటూ పరస్పరపరిచయం గావించింది అప్పటిదాకా తనతో మాట్లాడ్తూ ముద్దులొలికించే బాబిగాడ్తో ఆటలాడుతున్న యువకుణ్ని చూపిస్తూ.

"నమస్తే!" అంటూ ముభావంగాఅన్న రాజశేఖర్ సీరియస్ టైప్ ముఖ కవళికలు చూసి అతనితో సంభాషణ ఎలా పెంచాలో తెలియని ఆయువకుడు, "నమస్తే న్యూస్ రీల్ మొదలుపెట్టారులా ఉంది. మీరు వెళ్ళండి నేను మా ఫ్రెండ్ కొరకు వెయిట్ చేయాలి" అన్నాడు. వస్తామండీ' అంటూ భార్యా సమేతంగా హాల్లో అడుగు పెట్టాడు రమాపతి.

భర్త తన క్లాస్‌మేట్‌తో ముభావంగా ప్రవర్తించిన తీరు ఆలోచిస్తూ అతన్ని అనుసరించింది రమ. తెరపై సినిమానికళ్ళు అసంకల్పితంగా చూస్తూనే వున్నా. రమ ఆలోచనలుమాత్రం దారీ తెన్నూ లేకుండా సాగిపోతున్నాయ్.

తన పెళ్ళినాడు అంతా తననెంతో అదృష్టవంతురాలన్నారు. అతని అందం, హోదా చూసి తను కూడా అవునేమో అనుకుంది. కానీ ఈ రెండు సంవత్సరాల్లో అతని సహచర్యంలో తాను చాలా నేర్చుకుంది. అతనికి భార్య ఇతరులతో మాట్లాడటం గాని. పెద్దగా నవ్వడంగానీ పిక్నిక్‌లు ఫొటోలు అనడంగానీ, ఎక్కువగా జోక్స్ వేయడంగానీ అస్సలు నచ్చదు. అతనికిష్టంలేని పై సన్నివేశాల్లో ఏది ఎదురైనా మనిషి మరీ ముభావమైపోతాడు. అతడు వెన్వెంటనే ప్రకటించబోయే కోల్డ్ వార్‌కి సిగ్నల్ ఈ ముభావం. అంతలో రమకి తమ పెళ్ళయిన క్రొత్తలో రాజశేఖర్ తనపై ప్రకటించిన మొట్టమొదటి సీరియస్ కోల్డ్ వార్ గుర్తొచ్చింది.

.... .... .... .... ....

'రమారమా' అంటూ సుడిగాలిలా మిట మధ్యాహ్నం చేతిలో సూట్‌కేసుతో ఇంట్లో ప్రవేశించిన తన ప్రాణసఖి ఉమని చూసి ప్రాణం లేచివచ్చింది రమకి. పెళ్ళయినాక అతని కిష్టంలేదని తెలిసి పెద్దగా నవ్వడంగానీ, ఎక్కువగా మాట్లాడటంగానీ ఎపుడో మర్చిపోయిన రమకి ఉమ రాకతో పోతున్న ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఎన్ని రోజుల్నుంచో నవ్వుకి ముఖం వాచిన రమకి ఉమ సాన్నిధ్యంలో కాలమే తెలియలేదు. తమ చిన్ననాటి చిలిపి కజ్జాలు కాలేజీ స్నేహితుల బయోడేటాలు, తాము కాలేజీలో లెక్చరర్లకి పేరు పెట్టి ఆనందించిన తీరు చెప్పుకుని స్నేహితురాళ్ళిద్దరూ హాయిగా లోకమంతా తామే అయినటుగా. గదంతా అదరగొట్టేలా నవ్వుల జల్లులలో మునిగి తేలుతున్నారు.

ధనధనామంటూ అడుగుల చప్పుడుతో ప్రక్క గదిలో ప్రవేశించిన మనిషిని చూసి, నాలిక్కరుచుకుని, హడావిడిగా కాఫీకి నీళ్ళు పెట్టి ఉమతో ఇప్పుడే వస్తానని చెప్పి రాజశేఖర్ దగ్గరికెళ్ళింది రమ.

"ఏమిటా నవ్వులు? అంత గట్టిగా, అసహ్యంగా ఇంటి కప్పెగిరేలా? (నవ్వులకే కప్పులెగిరిపోతాయా? చెప్పండి) కొంచెం నెమ్మదిగా మాట్లాడుకోలేరూ. ఇంట్లో ఎవరో పోట్లాడుకుంటున్నారని రోడ్డుమీది జనం అనుకోవాలా?" అంటూ చిరాగ్గా చీవాట్లు వేస్తున్న పతిదేవుడ్ని చూసి ఏం చెప్పాలో తెలియక నీళ్ళు నములుతూ "మా ఫ్రెండ్ ఉమ వచ్చిందండీ. ఏదో ఇంటర్వ్యూకి వచ్చిందట. అది మా ఫ్రెండ్స్ కబుర్లు చెప్తూంటే వింటున్నానండి అంది, కానీ ఆ చిరాకులో తన మాటలేం అతడు వినిపించుకోడని తెలిసినా.

"మా ఉమండీ" అంటూ పరిచయం చేస్తున్న రమ మాట పూర్తవకుండానే వసపిట్ట ఉమ "నమస్తే అన్నయ్యగారూ" అంటూ మాటలు కలిపేసింది. ఊపిరాడకుండా భోజనాలయేదాకా కబుర్లు చెప్తూనే వుంది ఉమ.

రమకి ఉమని చూస్తే ఎన్నాళ్ళకి ఈ ఇల్లు సరదాగా కబుర్లతో కళకళలాడుతూంది. కడుపునిండా తిండి. కంటికి నిద్ర లేకున్నా, మనసునిండా ఆనందం మాత్రం తప్పక వుండాలి. కాని తిండి, నిద్ర లేకుండా అదెలాగూ సాధ్యంగాదు గనుక, తృప్తిగా. సరదాగా కబుర్లయినా వుంటే ఆ కష్టాలు మరిచిపోవచ్చు ఎవరయినా అనే తత్వం రమ, ఉమలది, అందుకే కాలేజీలో వుండగా ఇద్దరూ "నవ్వు, నవ్వించు, నీ చుట్టూ నవ్వుల పంట పండించు" అంటూ ఎప్పుడూ తాము నవ్వుతూ, జోక్స్‌వేసి ఇతర్లని కడుపుబ్బేలా నవ్విస్తూ గడిపేవారు. అలాటిది పెళ్ళవగానే, అతని తత్వం అర్థమయి నవ్వే వాళ్ళని చూసిఆనందించడంమాత్రం నేర్చుకుంది రమ.

ఆ రాత్రి భోజనాలయినాక గదిలోకెళ్ళిన రమతో రాజశేఖర్ అసలు మాట్లాడలేదు. అప్పటికే నిద్ర నటిస్తున్నాడు. కారణం అర్థంగాని రమ మౌనంగా పడుకుంది.

మరునాటి ఉదయం బ్రష్షుకోసం పక్కమీదినుండే రామనామజపంలా రమానామ జపం చేస్తూ లేచే రాజశేఖర్ తన పనులన్నీ మౌనంగా తానే పూర్తి చేసుకుని

రమతో మాటలేకుండానే ఫోంచేసి. ఉమతో మాత్రం వెళ్ళొస్తానండీ. మీరింకో రెండు రోజులయినా వుండాలి అంటూ గడప దాటాడు. "నయం ఈయనకి ఈ మాత్రం మర్యాదయినా తెలిసింది ఉమని కూడా ఎక్కడ పలకరించకుండా వెళ్ళిపోతారో" అని భయపడిన రమ అనుకుంది.

అదేమిటె అలా వున్నావ్ అంటున్న ఉమతో- ఏంలేదే ఉమా, కోల్డ్.. అంటున్న రమ మాటలు పూర్తవకుండానే వెధవ జలుబుకు ఇంత బాధపడాలా, వుండు అంటూ బాగ్ తెరిచి, విక్స్ టాబ్లెట్ చప్పరించమని చేతిలో పెట్టింది. ఉమ అమాయకత్వానికి. "అయ్యో కోల్డ్ కాదె తల్లీ, మావారు కోల్డ్‌వార్ ప్రకటించారు. "ఆ జలుబేదో మా సంసారాని కేపట్టుకుంది అనుకుంటూ, ఏడవలేక నవ్వింది రమ.

ఆ సాయంత్రం రాజశేఖర్ రాకముందే ఉమ వెళ్ళిపోవడంవల్ల, వాన కురిసి వెలిసి నట్టు వాతావరణం ప్రశాంతంగా రోజూలా వుంది. ఆ రోజు ఆఫీసునుంచి వచ్చిన రాజశేఖర్ వాతావరణంలో మార్పునిబట్టి ఉమ వెళ్ళిపోయిందని గ్రహించి ఊరు కున్నాడు తప్ప, రమనేం ప్రశ్నించలేదు.

వారం రోజులదాకా ఇంట్లో మౌనంగా మెలగడం తప్ప,ఆ ఇంట్లో ఇంకో ప్రాణి వుందన్న సంగతే మరిచిపోయినట్లు ప్రవర్తిస్తున్న భర్తనిచూసి, మొదటిసారిగా కోల్డ్‌వార్‌లోని తీవ్రతకి గురయిన రమ ఎంతో బాధపడింది. నెమ్మదిగా రాజశేఖర్, రమాపతి అయ్యేసరికి రమ మనస్సు వార్ సమయంలో జరిగిన ప్రతి చిన్న సంఘటనకి ఒక ముక్క చొప్పున వెయ్యి వ్రక్కలయింది.

ఆ తర్వాత వారంరోజులకి "రమా



ఉచితం !! **ముత్యాల సరాలు** FREE !!

# ప్రేమ స్వరూపియైన దేవుడు

దేవుడు ప్రేమ స్వరూపి అని, నిష్పక్షపాతియని అంటున్నారే నిజముగా ఆయన అటువంటివాడైతే లోకములో ఇంతమంది బీదవారు, వ్యాధిగ్రస్థులు ఎందుకున్నారు. ఆ దయామయుడైన దేవుడు ఈ మానవులలో కొంతమందిని ఎందుకు త్రాగుడు, మత్తు మందు తైలగిత ఆనందములకు బానిసలుగా చేశాడు" ఒక నాస్తికుడైన మంగలి మాదయ్యా తనకు బోధ చేస్తున్న బోధకుణ్ని ప్రశ్నించాడు. బోధకుడు మాట్లాడకుండా మౌనంగా నడుస్తున్నాడు. అది ఒక మురికివాడ, లోకంలోని దారిద్ర్యానికి, కల్మషమునకు ప్రతి రూపంగా ఉన్న ఆ స్థలములో ఎక్కడ చూచిన పేదరికం, వ్యాధులే కనిపిస్తున్నాయి. వారి బాధలను త్రాగుడులో మరచిపోతున్న దురదృష్ట ప్రజలు.

అందులో ఒక వృద్ధుడు బోధకుని దృష్టిని ఆకర్షించాడు. వృద్ధుని కళ్ళు ఎర్రగ చింత నిప్పులాగున్నాయి. ధరించిన మురికి గుడ్డలనుండి ఏదో దుర్వాసన వెలువడుతుంది. తల వెంట్రుకలకు తైల సంస్కారము లేదు. ఇష్టం వచ్చినట్టు జడలుకట్టి అడ్డదిడ్డంగా ఎదిగి పేలతో మురికితో నిండియున్నది. గెడ్డం తర్థ ఇంచుపైగా ఎదిగి ఆ ముఖాన్ని మరి భయంకరంగా మార్చివేసింది. తప్పత్రాగి మత్తెక్కిపడియున్న ఆ వ్యక్తిని చూచి బోధకుడు ప్రశ్నించాడు. "మాదయ్యా! జానెడు జుట్టు, బారెడు గడ్డం పెంచుకొన్న ఈ వ్యక్తిని ఇలా ఉండనీయటం నీ మంగలి వృత్తికే తలవంపు ఈ వ్యక్తి నీ బారిగింటిలో నివసిస్తున్న వాడికే ఎందుకు నీవు క్షౌరం చేయలేదు. "వాడు నా దగ్గరకు రానప్పుడు నన్నేం చేయమంటావు!" నా దగ్గరికి వచ్చియుంటే వాడి గడ్డం నున్నగ గొరిగి వాడి తలను చక్కగా క్షౌరం చేసి వాడి స్వరూపాన్నే మార్చేవాడిని. వాడి దురవస్థకు నేను కారకుడను కాదు" అన్నాడు మాదయ్య.

"ఆ దేవుడు చేస్తున్నదీ కూడా అదేనయ్యా మాదయ్యా! అన్నాడు బోధకుడు. "ప్రయాసపడి భారము మోయుచున్నవారలారా! మీరు నావద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగచేతును" అని ప్రభు పిలుస్తుంటే మేము రాము అని నిరాకరిస్తున్నారు. నేడు జీవమును మేలను మరణమును కీడును మీ ఎదుటనుంచియున్నాను. నా మార్గమున నడచి నా కట్టడాలను అనుసరించిన యెడల మీకు మేలు కలుగును. మీ దేవుడు మిమ్మును ఆశీర్వదించును" అని దేవుడు పలికితే "ఓరి దేవుడా నీ కట్టడములను మేమనుసరించము, నువ్వు ఆదేశించిన మార్గములో నడవము" ఇలా తిరుగుబాటు చేసి ఆ ప్రభు పాదముల యొద్ద రానని. ప్రజలను ప్రభువు మాత్రము బలత్కారము చేయగలడా. వెలుగు లోకము లోనికి వచ్చిన మనుష్యుల క్రియలు చెడ్డవైనందున వారు వెలుగును ప్రేమించక చీకటినే ప్రేమించిరి

నశించిన దానిని రక్షించుటకు ప్రభు ఈ లోకమునకు వచ్చాడు. పాపములో గొంతు దాకా దిగి దురలవాట్లకు పాపపు వ్యాధులకు లోనైన ప్రతి మానవుణ్ని ఈనాడు ఆ ప్రభు తెరచిన బాహువులలోకి పిలుస్తున్నాడు. ఆ పిలుపుకు లోబడుచున్నారా?

—చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం ఉచితం ఉచితం

భగవత్స్వరూపుడైన ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన బోధలు తెలిపే ఆకర్షణీయమైన ఉచిత పుస్తకంగాని. ఆకర్షణీయమైన డిప్లొమా పొందటానికి ఉచితంగా లభించే బైబిలు కోర్సు గాని కావాలనుకుంటే. మీ చిరునామా మాకు ఈ రోజే తెల్పండి. పోస్టు ఖర్చులు కూడా మేమే భరించి మీకు ఉచితంగా పంపుతాము.

ఇదీ అడ్రసు :
రె. జాన్ దేవిడ్,
A. M. G.
పోస్టు బాక్సు-12,
చిలకలూరిపేట,
గుంటూరు జిల్లా(A.M.G.)

Gospel Message inserted by A. M. G.

మన ఫ్రెండ్సందరిలో నువ్వెంతో అదృష్ట వంతురాలివే. చక్కగా అన్నయ్యగారు ఆఫీస్ టైమ్‌లో తప్ప నిన్ను విడిచి క్షణం ఉండరులా ఉంది. ఫ్రెండ్స్ క్లబ్ అనే కాకి గోల లేకుండా, ఎంచక్కా ఈవెనింగ్స్ మీ రిద్దరే ఎంజాయ్ చెయ్యొచ్చు. మావారు క్షణం ఇంటిపట్టున ఉండకుండా "స్నేహ మేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం" అంటూ తిరిగేస్తున్నారు" అంటూ ఉమ రాసిన ఉత్తరం చూసుకుని రమ పెదవులపై నీరస దరహాస చంద్రిక ఉదయించాయి.

* * *

జనాన్ని తప్పించుకునివచ్చి స్కూటర్ మీద కూర్చున్న రమ, అవును ఉమా, ఏది మితిమీరినా ప్రమాదమే. మా వారు క్షణం ఇల్లువదలరని అంతా "రమాపతి" అంటారు. కానీ ఇంట్లోకూర్చుని వారానికి కనీసం రెండుసార్లయినా ఏదో కారణంగా కోల్డ్‌వార్ ప్రకటిస్తున్న ఈ రమాపతి గారి సంగతి వాళ్ళకేం తెలుసు. ఎప్పుడూ, ఎక్కడా ఫ్రీగా నవ్వరాదు. సినిమా సీరియస్‌గా చూడాలే తప్ప, ఏమీ కామెంట్ చెయ్యగూడదు. ఎంత నవ్వు వచ్చే సీనయినా నెమ్మదిగా నవ్వుకోవాలి తప్ప అసలు శబ్దం బయటికి రాకూడదు. మన కాలేజీ లైఫ్‌లో కళ్ళు పిక్చర్ చూస్తుంటే నోరు రన్నింగ్ కామెంటరీ చేసేది. అఫ్ కోర్స్ గట్టిగా కాదనుకో. చాలామంది కోపంవస్తే దులిపేసుకొని, మళ్ళీ క్షణంలో మాటలు కలిపేస్తారు. నేను చేసిన పుణ్యం ఏమోగానీ. ఈ మనిషి కోపంవస్తే వారానికి తగ్గకుండా మౌనవ్రతం పడతారు. ఇందాక వార్ సిగ్నల్ ఇచ్చారుగా మాక్లాస్ మేట్‌ని పరిచయం చేయగానే అనుకుంది రమ. కనబడిన వాళ్ళందరితో కబుర్లేసుకో కూడదు. చూసీచూడనట్లు పోవాలి అని రాజశేఖర్ తన కెపుడో చెప్పాడు. కాని పలకరించిన వాళ్ళకి సమాధాన మివ్వకుండా ఎలా? ఈ మనిషి విపరీత తత్వ మేమిటో గాని, నాకు తనూ, తనకి నేనూ తప్ప లోకంలో తన కెవరక్కర్లేదూ. నాకూ ఎవరూ ఉండకూడదు అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. కానీ ఏం చేయాలి. అటో, ఇటో అయితే వెంటనే కోల్డ్‌వార్ రంగం మీది కొస్తుంది" అనుకుంటూ గుమ్మంముందాగిన స్కూటర్‌నుంచి దిగింది రమ.

ప్రేమతో సినిమాకి తీసికెళ్ళిన రమాపతి పాపం రమతో మళ్ళీ ఎన్నాళ్ళవరకూ కోల్డ్‌వార్ (మౌనవ్రతం) ప్రకటించాడో?

★